క్లుప్తంగా

నాగార్జునసాగర్ పోలీస్‌స్టేషన్‌లో వాహనాలకు వేలం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ పోలీస్‌స్టేషన్‌లో వివిధ ఎక్సైజ్ కేసులలో సీజ్ చేయబడిన 4 మోటారు సైకిళ్ళు, 6 ఆటోలను పల్నాడు జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, కన్ఫిస్కేషన్ అథారిటీ ఉత్తర్వుల మేరకు గురజాల ఎస్‌డీపీవో ఆధ్వర్యంలో ఈ నెల 9న బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ పి.అనిల్‌కుమార్‌రెడ్డి సోమవారం తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు అదే రోజు ఉదయం 9 గంటలకు నాగార్జునసాగర్ పోలీస్‌స్టేషన్‌లో పేర్లు నమోదు చేసుకొని వేలంలో పాల్గొనాలని ఎస్‌ఐ సూచించారు.

జిల్లా ఖోఖో జట్టుకు ఒప్పిచర్ల విద్యార్థిని



కారెంపూడి: ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్ 14 బాలికల ఖోఖో జట్టుకు మండలంలోని ఒప్పిచర్ల జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని షేక్ మహీ మున్నీసా ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం విజయ లలిత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు చిత్తూరు జిల్లా బంగారుపాలెంలో జరగనున్న రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలలో మహీ మున్నీసా జిల్లా జట్టులో ఆడనుంది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మంగళగిరి మండలం నిడమర్రులో జరిగిన జిల్లా ఖోఖో జట్ల ఎంపికలో మహీ మున్నీసా ప్రతిభ చూపి జిల్లా జట్టుకు ఎంపికైందని హెచ్‌ఎం పేర్కొన్నారు. పాఠశాల ఖోఖో జట్టుకు శిక్షణ ఇచ్చిన పాఠశాల పీడీ చిన రత్తయ్యకు హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

విశ్వరూప మహాసభను జయప్రదం చేయండి

మాదిగ ఉద్యోగుల సమాఖ్య పల్నాడు జిల్లా అధ్యక్షులు వంగూరి

పిడుగురాళ్ల: మాదిగల ఆత్మగౌరవంగా నిర్వహించే విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలని మాదిగ ఉద్యోగుల సమాఖ్య పల్నాడు జిల్లా అధ్యక్షులు వంగూరి అశోక్ కుమార్ మాదిగ అన్నారు. పట్టణంలోని బాప్టిస్ట్ చర్చి ఆవరణలో మాదిగ విశ్వరూప మహాసభ వాల్ పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే మాదిగల విశ్వరూప మహాసభను గురజాల నియోజకర్గం నుంచి పెద్ద సంఖ్యలో మాదిగలు హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి, కౌన్సిలర్లు పసుపులేటి ఆనంద్, కుక్కమూడి సుందరరావు, మార్కెట్ యార్డు డైరెక్టర్లు చల్లగుండ్ల స్వామి, మందా జాషువా, దేవరకొండ సుశీల, మీసాల బాబు, రామా ఇశ్రాయేలు, కోటేశ్వరి, జి.కరుణాకర్ తదితరులు ఉన్నారు.

26న రజక ఆత్మగౌరవ మహాసభ

గురజాల : ఈనెల 26వ తేదీన గుంటూరులో రజక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రజక ఆత్మగౌరవ మహాసభ నిర్వహించడం జరుగుతుందని రజక సంఘం నాయకులు ఆత్మకూరి అలేఖ్య, కన్నారపు శ్రీను, కోయా పుల్లారావులు తెలిపారు. మండల పరిధిలోని చర్లగుడిపాడు గ్రామంలో వారు మాట్లాడుతూ గుంటూరులోని వీరనారి చిట్యాల ఐలమ్మ ప్రాంగణంలో లక్ష మందితో రజక ఆత్మగౌరవ మహాసభ జరుగుతుందని రజక సంఘం సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

మాచవరం: అక్రమంగా పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ సమీర్ బాషా తెలిపారు. వివరాల ప్రకారం మండలంలోని రేగులగడ్డ గ్రామంలో అక్రమంగా పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు సోమవారం దాడులు నిర్వహించగా, గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తుల్ని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.6,450 నగదును స్వాధీనం చేసుకొని, నలుగురుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

యడ్లపాడులో తెనాలి ఫొటోగ్రాఫర్ దుర్మరణం

యడ్లపాడు: బైక్‌పై ప్రయాణిస్తూ సినీఫక్కీలో 20 అడుగుల ఎత్తులో ఉన్న వంతెనపై నుంచి కిందపడి తెనాలికి చెందిన ఫొటోగ్రాఫర్ మృతి చెందిన సంఘటన మండలంలో జరిగింది. వివరాలలోకి వెళితే.. తెనాలి పట్టణం రామలింగేశ్వరనగర్‌కు చెందిన ఫొటోగ్రాఫర్ కొడవటి ప్రభుకుమార్ (31) బైక్‌పై సోమవారం సాయంత్రం చిలకలూరిపేట నుంచి గుంటూరు వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో యడ్లపాడు వద్ద ప్రారంభంలో ఉన్న అండర్‌పాస్ వంతెనపై ఎక్కి మలుపు తిప్పే క్రమంలో వాహనం అదుపుతప్పి ఎడమవైపు ఉన్న సైడ్‌వాల్‌కు ఢీకొంది. దీంతో బైక్‌పై ఉన్న ప్రభుకుమార్ ఒక్కసారిగా గాల్లోకి ఎగిరి వంతెన కింద ఉన్న సర్వీసు మార్గంలోని స్పీడ్‌బ్రేకర్లపై వచ్చి పడ్డాడు. 108 వాహన సిబ్బంది చేరుకుని యువకుడిని పరీక్షించి తలకు బలంగా తగలడంతో అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఊహించని ఈ సంఘటనకు ఈ బ్రేకర్లకు సమీపంలోని బైక్ మెకానిక్, ఫాస్ట్‌ఫుడ్ దుకాణాలతో పాటు సమీపంగా ఉన్న జనం చూసి షాకయ్యారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పిందని అంతా ఊపిరి పీల్చుకున్నారు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న యడ్లపాడు ఎస్‌ఐ పి సురేష్ పరిశీలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి కృషి చేస్తా



ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని సన్మానిస్తున్న ఎస్‌కేబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి

ప్రభుత్వ విప్ పీఆర్కే

మాచర్ల: వెనుకబడిన మాచర్ల నియోజకవర్గంలో అనేక సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన ఎస్‌కేబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు కుర్రి సాయి మార్కొండారెడ్డి, ఎంఈఓ వేముల నాగయ్య, రిటైర్డ్ డిప్యూటీ డీఈఓ గాదె రామకృష్ణారావు ఆధ్వర్యంలో జరిగిన పూర్వ విద్యార్థుల అభినందన సభలో ఆయన పాల్గొన్నారు. కళాశాల అభివృద్ధికి సమష్టిగా పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు కృషి చేసి బి+ గ్రేడ్ సాధించటం ఎంతో అభినందనీయమన్నారు. ఈ నేపథ్యంలో డిగ్రీ కళాశాలలో తప్పనిసరిగా పీజీ సెంటర్‌ను ఏర్పాటు చేయిస్తానన్నారు. త్వరలో సీఎం జగన్ వరికపూడిసెల ప్రాజెక్టు శంకుస్థాపనకు విచ్చేసే సమయంలో ఈ కళాశాల అభివృద్ధికి కృషి చేసి పీజీ సెంటర్‌ను ఏర్పాటు చేయిస్తానని, స్థలాన్ని కాపాడటంతో పాటు అన్ని రకాలుగా తన వంతు సహాయ సహకారాలందిస్తానన్నారు. ప్రభుత్వం తరఫున విద్యారంగాన్ని అభివృద్ధి చేయటానికి సీఎం జగన్ కృషి చేస్తున్నారని, ఇక్కడ ప్రభుత్వ కళాశాలను తాను సైతం అభివృద్ధి చేసేందుకు చేయూతనందిస్తానని, విద్యా, వైద్యంలో ఎక్కడా రాజీ పడకుండా అభివృద్ధికి కోట్ల రూపాయలు కేటాయించేలా కృషి చేస్తానన్నారు. బి+ గ్రేడ్ సాధించటానికి కృషి చేసిన ప్రభుత్వ విప్ పీఆర్కే, కేసీపీ జీఎం వెంకటరమణలను పలువురు పూర్వ విద్యార్థులు సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీ కుమారి, నాయకులు కేశం ఆదినారాయణ, పఠాన్ నాగూర్‌వలి, న్యాయవాది ప్రభుదాసు, పలువురు కేసీపీ ఉద్యోగులు, అధ్యాపకులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జగనన్న గోరుముద్ద నిర్వహణపై పరిశీలన



విద్యార్థులతో మాట్లాడుతున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు

దాచేపల్లి : విద్యార్థులకు రుచికరమైన ఆహారం అందించాలని ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని కేసానుపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జగనన్న గోరుముద్ద పథకాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. జగనన్న గోరుముద్ద పథకం నిర్వహణకు అందించే సరుకుల్లో నాణ్యతలేదని కొంతమంది విపక్ష నేతలు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో హైస్కూల్‌కు చేరుకున్న ఆయన సరుకులను పరిశీలన చేసి విద్యార్థులతో మాట్లాడారు. తమకు అందించే భోజనం రుచికరంగా, నాణ్యతగా ఉందని విద్యార్థులు చెప్పారు. ఎప్పటికప్పుడు సరుకులు హైస్కూల్‌కు వస్తున్నాయని, మెనూ ప్రకారం నాణ్యమైన సరుకులతో ఆహార పదార్థాలు తయారు చేయిస్తున్నామని ఉపాధ్యాయులు తెలిపారు. జగనన్న గోరుముద్ద నిర్వహణ, సరుకుల పట్ల ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పరిశీలనలో ప్రధానోపాధ్యాయుడు చెట్టిపాగు ఏసురత్నం, ఉపాధ్యాయులు ఉన్నారు.

కరాటే పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

దాచేపల్లి : స్థానిక మదర్ థెరిస్సా ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు కరాటే పోటీల్లో సత్తా చాటినట్లు డైరెక్టర్ అంబటి చంద్రశేఖర్ సోమవారం తెలిపారు. సుమన్ సుటోకాన్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఖమ్మం వర్తక సంఘం భవన్‌లో నిర్వహించిన 27వ జాతీయ స్థాయి కరాటే చాంపియన్ షిప్-2023 పోటీల్లో విద్యార్థులు జూనియర్ విభాగంలో రిత్విక్ సుశీల్ మొదటి స్థానం, గుండా ధన్వంతరి రెండవస్థానం, ఓం ప్రకాష్ మూడవ స్థానం, షణ్ముఖ్ నాల్గవ స్థానం, శివగణేష్, సాధియా ఐదవ స్థానం సాధించారని, సీనియర్ విభాగంలో రామ్‌చరణ్, మహేష్, రాజేష్, కార్తీక్ వరుసగా మొదటి నాలుగు స్థానాల్లో నిలిచారని ఆయన చెప్పారు. విజేతలైన విద్యార్థులను కోచ్ మల్లిఖార్జునరావు అభినందించారు.

జీవన నైపుణ్యాలపై బాలలకు శిక్షణ

గుడ్‌షెపర్డ్స్ కాన్వెంట్ ఆధ్వర్యంలో



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న రిసోర్సుపర్సన్ దిలీప్‌కుమార్

బయ్యవరం(క్రోసూరు): మండలంలోని బయ్యవరం గ్రామంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల బాలలకు సోమవారం అమరావతి, గుడ్‌షెపర్డ్స్ పాఠశాలల ఆధ్వర్యంలో జీవన నైపుణ్యాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంస్థ సిస్టర్ దయానా అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సాంబశివరావు మాట్లాడుతూ బాలలకు జీవన నైపుణ్యాలు ఎంతో అవసరమని అన్నారు. బాలలు సమయానుకూలంగా ఆలోచనావిధానం మార్చుకోవాల్సి ఉంటుందన్నారు. ధైర్యంగా ఉండాలన్నారు, కొత్త శోధనలతో ముందుకుసాగాలన్నారు. సిస్టర్ దయానా మాట్లాడుతూ బాలలు ఎదుటి వ్యక్తికి సహాయం చేయాలన్న ఆలోచనతో ఉండాలన్నారు. రిసోర్సుపర్సన్ దిలీప్‌కుమార్ మాట్లాడుతూ బాలలకు ఆలోచన స్కిల్స్, సోషల్, ఎమోషనల్ స్కిల్స్ ప్రధానంగా తెలిసి ఉండాలన్నారు. బాలలు కొత్తగా ఆలోచించాలన్నారు. ప్రతి ఒక్క బాలలు జాలి, దయ, భరోసా చిన్ననాటి నుంచి కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో చిల్కాబాబూరావు, మారుతీరావు తదితరులు పాల్గొన్నారు.

కన్నతల్లి పట్ల అమానుషం

తల్లిని కొట్టి వైకుంఠధామంలో వదిలేసిన కొడుకు, కోడలు



మిర్యాలగూడ మండలం వాటర్‌ట్యాంకు వద్ద గల వైకుంఠధామంలో పడి ఉన్న వృద్ధురాలు

మిర్యాలగూడ టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లాకు చెందిన ఓ వ్యక్తి తన కన్నతల్లిని కొట్టి నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలోని వైకుంఠధామంలో వదిలేసి వెళ్లాడు. ఆ వృద్ధురాలు రెండు రోజుల పాటు అక్కడే నరకయాతన పడింది. ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గుంటూరు జిల్లా దాచేపల్లి మండలం గామాలపాడు గ్రామానికి చెందిన చింతకాయల వెంకటరత్నమ్మ-ఏడుకొండలుకు కుమారుడు వెంకటేశ్వర్లు, కుమార్తె తిరుపతమ్మ ఉన్నారు. కుమార్తెకు వివాహమైంది. వెంకటేశ్వర్లు తన భార్యతో కలిసి కూలీనాలీ చేసుకుంటూ అక్కడే జీవనం సాగిస్తున్నాడు. వెంకటేశ్వర్లు భార్యకు, ఆయన తల్లి వెంకటరత్నమ్మకు నిత్యం గొడవలు జరుగుతుండేవి. ఆమెకు వచ్చే పింఛన్ వీరికి ఇవ్వకపోవడంతో కొడుకు, కోడలు ఆమెపై కోపం పెంచుకున్నారు. ఈ క్రమంలో శనివారం వెంకటేశ్వర్లు, తన భార్యతో కలిసి ఆమెను తీవ్రంగా చితకబాది ఆటోలో వచ్చి మిర్యాలగూడ మండలం వాటర్ ట్యాంకు తండా వద్ద గల వైకుంఠధామంలో వదిలేసి వెళ్లారు. ఈ క్రమంలో ఆదివారం గ్రామానికి చెందిన పంచాయతీ సిబ్బంది రవి మొక్కలకు నీళ్లు పోసేందుకు వెళ్లగా వృద్ధురాలు వైకుంఠధామంలో ఒంటరిగా పడి ఉండటంతో సర్పంచ్ ధనావత్ రాంచందర్‌నాయక్‌కు సమాచారాన్ని తెలిపాడు. ఆయన మిర్యాలగూడ రూరల్ పోలీసులతో పాటు వయోవృద్ధుల సంక్షేమ శాఖకు సమాచారం అందించగా.. ఏఎస్‌ఐ ఉమాపతిరావు, ఫీల్డ్ ఆఫీసర్ మునగాల నాగిరెడ్డి అక్కడకు చేరుకున్నారు. వృద్ధురాలికి ఫిట్స్ రావడంతో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. తన కొడుకు, కోడలు నిత్యం తనను కొడుతున్నారని వృద్ధురాలు అధికారులతో వాపోయింది. దీంతో పోలీసులు ఆమె కుమారుడిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం అతడి ద్వారా లిఖితపూర్వకంగా రాయించుకున్నారు. వృద్ధురాలిని అంబులెన్స్‌లో స్వగ్రామానికి తరలించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

నాదెండ్ల: రోడ్డు ప్రమాదంలో పూర్తిగా ఆరోగ్యం దెబ్బతిన్న వ్యక్తి ఎలుకల మందు తిని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గణపవరం గ్రామంలో చోటు చేసుకుంది. నాదెండ్ల ఎస్సై జె బలరామ్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు నరసరావుపేటకు చెందిన షేక్ మస్తాన్‌వలి (35) పదమూడేళ్ళ క్రిందట గణపవరం గ్రామానికి చెందిన షేక్ మీరాబీతో వివాహమైంది. ఏడేళ్ళ నుంచి గణపవరంలోనే నివాసం ఉంటు ఇనుప బీరువాలు, తాళాలు మరమ్మతులు చేస్తున్నాడు. సుమారు నెల క్రితం రోడ్డు ప్రమాదంలో తలకు బలమైన గాయాలై అవయవాలు పనిచేక ఇంటికే పరిమితమయ్యాడు. మద్యానికి బానిసైన మస్తాన్‌వలి గత నెల 29న రాత్రి 7 గంటల సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఎలుకల మందు తిన్నాడు. బంధువులు గమనించి నరసరావుపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు రిఫర్ చేయగా సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడికి ఇరువురు కుమార్తెలు ఉన్నారు. భార్య మీరాబీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రేపు మాచవరంలో జగనన్నకు చెబుదాం

మాచవరం: మాచవరం మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 8న మండల స్థాయిలో జగనన్నకు చెపుదాం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ యు.బి.వరప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి పలు ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు హాజరవుతారని తెలిపారు. కావున మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు కార్యక్రమానికి హాజరు కావాలని తెలియజేశారు. మండల ప్రజలు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పిల్లలకు పొగాకు ఉత్పత్తుల అమ్మకం నిషేధం

నరసరావుపేట: చిన్న పిల్లలకు, స్కూల్ విద్యార్థులకు పొగాకు ఉత్పత్తుల అమ్మటం నిషేధమని స్టేట్ పొగాకు నియంత్రణ కార్యాలయ న్యాయ సలహా దారు పుట్టి శివ పేర్కొన్నారు. సోమవారం జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా నరసరావుపేట బస్టాండ్ ఎదురుగా ఉన్న టీ దుకాణాలు, కూల్ డ్రింక్స్ దుకాణాలలో లా ఎన్‌ఫోర్స్‌మెంట్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ షాపులలో అక్రమంగా సిగరేట్స్, గుట్కాలు, ఇతర పొగాకు ఉత్పత్తుల అమ్మకాలు నిర్వహించరాదన్నారు. కార్యక్రమంలో జిల్లా డీసీఎం, సోషల్‌వర్కర్ నందిగం సురేష్, కంభంపాలెం మున్సిపల్ హైస్కూలు ప్రధానోపాధ్యాయులు నాగయ్య పాల్గొన్నారు.

కరాటే పోటీలలో ఎస్‌ఆర్‌కేహెచ్ విద్యార్థుల ప్రతిభ

అమరావతి: ఈ నెల ఐదవ తేదీన ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం గుంటుపల్లి వ్యాగన్ వర్క్‌షాప్ రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో నిర్వహించిన 22వ జాతీయ ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ టోర్నమెంట్‌లో శ్రీ రామకృష్ణ హిందూ హైస్కూల్ విద్యార్థులు తృతీయ స్థానం సాధించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక అభినందన కార్యక్రమంలో విజేతలు ఎన్.గోపి, కె.అజయ్, టి.నరసింహ, వి.జాన్, పి.బాబు, డి.వెంకటేశ్వర్లును అభినందించంచారు. ఈ సందర్భంగా పాఠశాల పీఈటీ అనురాధ మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగతంగానే కాకుండా ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో కూడా తృతీయస్థానం సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బందితో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

రొంపిచర్లలో అగ్ని ప్రమాదం

రొంపిచర్ల: మండల కేంద్రంలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో మూడు పూరిళ్లు దగ్ధమై రూ.5 లక్షల రూపాయల ఆస్తినష్టం సంభవించింది. ఈ ప్రమాదంలో తంబా వెంకటేశ్వర్లు, సుబ్బ రత్నం, శ్రీనివాసరావుకు గృహాలు దగ్ధమయ్యాయి. రాత్రి వేళ అందరూ నిద్రిస్తుండగా పెద్ద మంటలు ఎగసిపడ్డాయి. ఈ మంటల వేడికి మెలుకు వచ్చిన వెంకటేశ్వర్లు మనవరాలు గృహం నుండి బయటకు వచ్చి పెద్దగా కేకలు వేసింది. గృహాల్లో నిద్రిస్తున్న వారంతా ఇంట్లోనుంచి పరుగులు తీయడంతో ప్రాణాలతో బయట పడ్డారు. ఈ ప్రమాదంలో రూ.1.50 లక్షల రూపాయల నగదు, 3 సవర్ల బంగారం, గృహోపకరణాలు, దుస్తులు, పిల్లల పుస్తకాలు, సామన్లు, ఆధార్ రేషన్ కార్డులతో సహా అన్ని అగ్నికి ఆహుతి అయ్యాయి. విషయం తెలుసుకున్న వీఆర్వో పడాల సుబ్బారెడ్డి, సంఘటనా స్థలాన్ని చేరుకొని బియ్యం, నగదును అందజేశారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం



సందీప్ మృతదేహం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు సమీపంలో కృష్ణా నదిలో స్నానం చేసేందుకు వెళ్లి గల్లంతైన యువకుడి మృతదేహం సోమవారం ప్రాజెక్టుకు 300 మీటర్ల దూరంలోని శివాలయం వద్ద లభ్యమైనట్లు అచ్చంపేట ఎస్‌ఐ సీహెచ్ మణికృష్ణ తెలిపారు. తెలంగాణ రాష్ట్రం, సూర్యాపేట జిల్లా, మేళ్లచెరువు గ్రామానికి చెందిన యాంపొంగు సందీప్(19) తన స్నేహితులతో వచ్చి ప్రాజెక్టు సమీపంలోని పుష్కరఘాట్ వద్ద స్నానం చేస్తూ ఆదివారం సాయంత్రం కృష్ణానదిలో గల్లంతైన విషయం విదితమే. తన సిబ్బంది సహాయంతో సోమవారం ఉదయం పడవల ద్వారా ఈతగాళ్లు కృష్ణానదిలో గాలించగా గల్లంతైన సందీప్ మృతదేహం లభ్యమైనట్లు చెప్పారు. మృతుని తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ప్రమాదవశాత్తు నదిలో మునిగిపోయి నట్లుగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు పోస్టుమార్టం నిమిత్తం తరలించామన్నారు.

సంక్షేమం అభివృద్ధి కావాలంటే జగనన్న రావాలి

- జగన్‌ను మళ్లీ సీఎం చేయండి
- జే జేలు పలకండి.. ప్రతిపక్షాలకు బుద్ధి చెప్పండి
- ప్రభుత్వ విప్ పీఆర్కే

మాచర్ల: రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప యాత్ర ఆరు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన తన సంకల్ప యాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు సీఎం అయినప్పటి నుంచి లక్షల కోట్లు కేటాయించి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను చేసిన ప్రజా సంకల్ప యాత్రలో ప్రజల సమస్యలను తెలుసుకొని అందుకనుగుణంగానే ప్రభుత్వంలోకి వచ్చాక 98 శాతం ప్రజల ఆకాంక్షల మేరకు పలు పథకాలు చేపట్టారన్నారు. ఎక్కడా రాజీ పడకుండా పేద వర్గాల కోసం నిరంతరం కష్టపడుతూ లక్షల కోట్ల రూపాయలను పేదల సంక్షేమం కోసం వారి ఖాతాలలో జమ చేస్తున్న ఘనత సీఎం దేనన్నారు. విద్యా, వైద్యం, ప్రాజెక్టులు, నీటిపారుదల, రైతులు, మహిళలు, డ్వాక్రా సంఘాలతో పాటు అన్ని వర్గాలకు న్యాయం చేసేలా ముందుకెళ్తున్నారన్నారు. ఎక్కడికక్కడ తాను చూసిన సమస్యలను పరిష్కరించే క్రమంలో భాగంగా నాలుగున్నర సంవత్సరాలుగా పరిపాలన చేసి పేదల మన్ననలు పొందుతున్నారన్నారు. కోట్ల మంది ప్రజలు ఇప్పటికీ సీఎం జగన్‌ను ఆరాధిస్తున్నారన్నారు. ఇవన్నీ తెలిసినా ప్రతిపక్షాలు విమర్శలు చేయటమే ధ్యేయంగా పనిచేస్తున్నాయన్నారు. అందులో భాగంగా మాజీ సీఎం చంద్రబాబు నాయుడు నిత్యం జగన్‌ను తిట్టేందుకే పరిమితమవుతున్నారన్నారు. ఆయనకు వస్తున్న జనం మద్దతును తట్టుకోలేక అనేక డ్రామాలాడుతున్నారన్నారు. ఇలాంటి ఎత్తుగడలన్నింటినీ ప్రజలు తిప్పికొట్టి మరో ఐదేళ్లు సీఎం జగన్‌ను ముఖ్యమంత్రి చేసి సంక్షేమ పథకాలు పొందాలన్నారు. రాబోయే రోజుల్లోనూ సంక్షేమ పథకాలు ప్రజలకు పూర్తిస్థాయిలో ఇదే విధంగా చేరాలంటే జగనే సీఎం కావాలని ప్రజలంతా సంపూర్ణ మద్దతు ఇవ్వాలన్నారు. వెనుకబడిన మాచర్ల నియోజకవర్గానికి సంబంధించి రూ.1,600 కోట్లతో త్వరలో వరికపూడిసెలకు శంకుస్థాపన చేయనున్నారన్నారు. అదే విధంగా 50పడకల ఆసుపత్రి, బుగ్గవాగు నుంచి రిజర్వాయర్ పథకం, రూ.800 కోట్లతో సాగర్-నడికుడి, దావుపల్లి జాతీయ రహదారి నిర్మాణం చేస్తున్నారన్నారు. సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, పాఠశాలల నిర్మాణం, వలంటీర్ల ఏర్పాటు, ఇప్పటికే రూ.3వేల కోట్లు మాచర్ల నియోజకవర్గానికి కేటాయించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఇవన్నీ గమనించని ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయన్నారు. బండలు వేసి రాజకీయాలు చేస్తున్నారన్నారు. వీటన్నింటిని పట్టించుకోకుండా సీఎం జగన్‌ను సీఎం చేయటానికి కంకణం కట్టుకోవాలని ప్రతి ఒక్కరూ సంపూర్ణంగా ఆలోచన చేసి ముందుకు సాగాలని ప్రభుత్వ విప్ పీఆర్కే పిలుపునిచ్చారు.

సత్తెమ్మతల్లి ఆలయంలో చోరీకి యత్నం



చోరీకి ప్రయత్నించిన ఆలయం (ఇన్‌సెట్) ఆగంతకులు వదిలివేసిన హుండీ

మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల గ్రామంలోని సత్తెమ్మతల్లి ఆలయంలో కానుకల హుండీని దొంగిలించేందుకు ప్రయత్నించిన ఘటన సోమవారం తెల్లవారుజామున జరిగింది. ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుర్తుతెలియని ముగ్గురు వ్యక్తులు స్కూటీపై వచ్చి గ్రామంలోని సత్తెమ్మతల్లి ఆలయం తలుపులు పగులగొట్టి ఆలయం లోనికి ప్రవేశించారు. ఆలయంలో ఉన్న కానుకల హుండీని ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా పక్కనే మరో ఆలయంలో నిద్రిస్తున్న అయ్యప్ప మాలధారులు గమనించి వెంటబడ్డారు. దీంతో ముగ్గురు ఆగంతకులు ద్విచక్రవాహనాన్ని, వారి చేతిలోని హుండీని అక్కడే వదిలేసి పరారైనట్లు ఆలయ పూజారి తిమ్మనపల్లి జగన్నాథం తెలిపారు. ఆగంతకులు వాడిన ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని జరిగిన ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిశోర్‌బాబు తెలిపారు.

11 సంవత్సరాలుగా అయ్యప్పలకు సద్ది



సద్ది కార్యక్రమంలో అయ్యప్ప మాలధారులు

క్రోసూరు: మండల కేంద్రం క్రోసూరులో అయ్యప్ప సేవాసమితి గత 11 సంవత్సరాలుగా అయ్యప్ప మాలధారులకు సద్దిసేవలు అందిస్తున్నారు. ఎంతో భక్తి శ్రద్ధలతో అయ్యప్ప మాలలు ధరించి అయ్యప్ప స్మరణతో 41 రోజుల పాటు కఠోర దీక్షలు చేస్తుంటారు. నియమాలను అనుసరించి కార్తీక మాసం నుంచి మకర సంక్రాంతి వరకు అయ్యప్పస్వామి మాల వేసుకుంటారు. కఠినమైన నియమ నిష్టలతో దీక్షను కొనసాగిస్తారు. అయ్యప్ప మాలధారులకు సద్ది (మధ్యాహ్నభోజనం) ప్రతి ఏటా ఉచితంగా దాతల సహాయ సహకారాలతో అందిస్తున్న అయ్యప్ప సేవా సమితి సేవలు క్రోసూరు గ్రామంలో నిర్వహించటం మాలధారులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రతి రోజు సుమారు 100 నుంచి 120 మంది సద్దికి హాజరవుతుంటారు.

కృష్ణారెడ్డికి నివాళులర్పించిన ఎమ్మెల్యే కాసు



కృష్ణారెడ్డికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాసు

గురజాల : తెలుగుదేశం పార్టీ నాయకుల చేతిలో హత్యకు గురైన కూనిరెడ్డి కృష్ణారెడ్డికి ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి నివాళులర్పించారు. కృష్ణారెడ్డి దశ దిన కర్మ కార్యక్రమంలో సోమవారం ఎమ్మెల్యే కాసు పాల్గొన్నారు. కృష్ణారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ), మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ, కొమ్మినేని రవిశంకర్, నగర పంచాయతీ చైర్ పర్సన్ పోలు పవన్మయి వీరారెడ్డి, వైస్ చైర్మన్ షేక్ బడేజానీ, కర్రా చిన కోటేశ్వరరావు, వీరంరెడ్డి అమరారెడ్డి, బి.ఇష్టకామిరెడ్డి, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అదుపు తప్పింది.. డివైడర్ ఎక్కింది!



అధిక లోడ్‌తో వస్తున్న లారీ అదుపు తప్పి డివైడర్ ఎక్కిన సంఘటన సోమవారం తెల్లవారుజామున పట్టణంలో చోటుచేసుకుంది. వివరాల్లో కెళ్లితే.. మల్లమ్మ సెంటర్ ఓవర్ బ్రిడ్జి మీదుగా ఆర్టీసీ బస్టాండ్ వైపుకు అధిక లోడ్‌తో లారీ వెళ్తుంది. బిలాల్ హోటల్ దిగువ భాగం వద్దకు వచ్చేసరికి లారీ అదుపు తప్పి డివైడర్ పైకి ఎక్కింది. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతం ఆసమయంలో ఎవ్వరూ లేకపోవటంతో పెను ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న ట్రాఫిక్, టూటౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. క్రేన్ సహాయంతో లారీను అక్కడి నుంచి తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

–నరసరావుపేట టౌన్